సాక్షి గుంటూరు

శనివారం ı 21 ı జూన్ ı 2025



చౌడేశ్వరి ఆలయ వార్షికోత్సవాలు

రెంటచింతల: శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయ 17వ వార్షికోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ఓరుగంటి మారుతీ శర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట రూరల్: ఇస్సపాలెం మహంకాళి ఆలయ నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన జూజం నాగేశ్వరరావు, మాధవి దంపతులు రూ.1,01,116 విరాళం ఇచ్చారు.



వృద్ధాశ్రమానికి విరాళం

తెనాలి అర్బన్: ఐతానగర్‌కు చెందిన జెట్టి రవీంద్రనాథ్ చౌదరి, సంధ్యారాణిలు శ్రీ మహాత్మా సేవాశాంతి ఆశ్రమానికి శుక్రవారం రూ.2.50 లక్షలు విరాళంగా ఇచ్చారు.

న్యూస్‌రీల్

అమరావతి పనుల్లో ప్రమాణాలు పాటించాలి



తాడికొండ: అమరావతి నిర్మాణ పనుల్లో పర్యావరణ, సామాజిక రక్షణ చర్యలు, కార్మికుల ఆరోగ్య భద్రత తదితర అంశాలపై గుత్తేదారులతో శుక్రవారం తుళ్లూరులోని హెచ్‌ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో సదస్సు నిర్వహించారు. అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సీఎండీ డి. లక్ష్మీ పార్థసారథి మాట్లాడుతూ పనుల్లో నిర్దేశిత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. గుత్తేదారు సంస్థలు తమ కార్యకలాపాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఆదేశించారు. బాల కార్మికులు కనిపిస్తే సంస్థలపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్మికుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన భద్రతా పరికరాలు, అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ప్రపంచ బ్యాంకు బృందంలోని మహిళా ప్రతినిధి జయశర్మ కార్మికులపై లైంగిక దాడి, హింస ఘటనలు జరిగినపుడు పాటించాల్సిన గోప్యత, బాధితులకు అందించాల్సిన సహాయంతో పాటు పలు అంశాలు వివరించారు. అనంతరం గుత్తేదారులతో ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో సీఆర్‌డీఏ పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో యోగా దినోత్సవం

నెహ్రూనగర్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లాస్థాయి యోగా కార్యక్రమాన్ని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వార్డ్ సచివాలయ కార్యదర్శులు, జీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉదయం 5:30 గంటలకు జరిగే కార్యక్రమంలో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు.

వ్యవసాయ శాఖలో బదీ'లీలలు'

- భారీగా తప్పిదాలు
- ఒకే పోస్టులో ఇద్దరు, ముగ్గురు నియామకం

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయ శాఖలో సహాయ సంచాలకుల(ఏడీఏ) బదిలీల్లో అనిశ్చితి కొనసాగుతోంది. ఈ నెల 10వ తేదీ ఉదయం మండల వ్యవసాయ అధికారులతో పాటు, ఏడీఏల బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎన్నడూ లేని విధంగా పైరవీలు జరగడంతో మార్పులు, చేర్పులకు అంతే లేకుండా పోయింది. ఎట్టకేలకు వ్యవసాయ అధికారుల బదిలీల వ్యవహారం కొలిక్కి వచ్చినప్పటికీ.. ఏడీఏల బదిలీల వ్యవహారానికి ముగింపు లభించలేదు. ఏడీఏల బదిలీలను జోనల్ యూనిట్‌గా తీసుకొని చేపట్టారు. అయితే, ఒక పోస్టులో ఇద్దరు, ముగ్గురిని నియమించడం, జోన్-4కు చెందిన ఏడీఏను జోన్-3కి బదిలీ చేయడం వంటి తప్పిదాలు భారీగా జరిగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 19 మంది ఏడీఏలు బదిలీ అయ్యారు. వీటికి తోడు సిఫారసులు, పైరవీలు కూడా ఊపందుకోవడంతో బదిలీ ఉత్తర్వులు వెలువడిన కొన్ని గంటల్లోనే వీటిని హోల్డ్‌లో పెట్టారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఏడీఏలు ఎవ్వరూ రిలీవ్ కావద్దనే ఆదేశాలు వచ్చాయి. అయితే, పది రోజులు గడిచినా రివైజ్డ్ ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో పాత స్థానాల్లో కొనసాగలేక, కొత్త స్థానాల్లో చేరలేక ఏడీఏల పరిస్థితి దయనీయంగా మారింది. పైరవీలు పెద్దఎత్తున జరుగుతుండటంతో బదిలీలపై అనిశ్చితి మరో రెండు, మూడు రోజులు కొనసాగే అవకాశం ఉంది. ఈ నెల 10వ తేదీ నుంచి బ్యాన్ వచ్చింది. ఏడీఏల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు వెలువడాలంటే ముఖ్యమంత్రి కార్యాలయం జోక్యం అవసరం ఉందనే చర్చ వ్యవసాయ శాఖలో కొన సాగుతోంది.

లాసెట్‌లో సూర్యతేజకు మూడవ ర్యాంకు



నరసరావుపేట: పట్టణానికి చెందిన బత్తుల నరసింహం, సరస్వతి దంపతుల రెండో కుమారుడు సూర్యతేజ శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన ఏపీ-లాసెట్ ఫలితాలలో ఓపెన్ కేటగిరీలో మూడో ర్యాంక్ సాధించారు. దివ్యాంగుడైన ఆయన పదో తరగతి, ఇంటర్ ప్రైవేటుగానే పూర్తి చేశారు. ఇంటర్‌లో 80 శాతం మార్కులు సాధించారు. నేషనల్ లా యూనివర్సిటీ నిర్వహించిన పరీక్షలకు హాజరై ఒడిశా యూనివర్సిటీలో సీటు పొందారు. 15 ఏళ్ల వయస్సులో వచ్చిన స్పాండిలైట్ వ్యాధితో అనారోగ్యానికి గురై ఆ తర్వాత చికిత్స చేయించుకున్నప్పటికీ అంగ వైకల్యం వదలలేదు. జీవితంలో ఓ గొప్ప న్యాయవాదిగా, న్యాయమూర్తిగా ఎదగాలనే ఆకాంక్షను సూర్యతేజ వ్యక్తం చేశారు.

యోగాతో హెల్త్ వెల్త్

- యోగా ఎంత సాధన చేస్తే అంత ఫలితం
- చక్కని ఆరోగ్యం, మానసిక ప్రశాంతత
- రోజు రోజుకూ పెరుగుతున్న యోగా సాధకులు
- నేడు జిల్లాలో ఐదు లక్షల మందితో యోగాసనాలు
- అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఏర్పాట్లు

యోగా... నేడు అంతర్జాతీయ తారకమంత్రంగా మారిపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే మన దేశమే మార్చేసింది. ఇక్కడే పుట్టి ఖండాతరాల్లో వ్యాపించింది. 2014లో అంతర్జాతీయ పేటెంట్ పొందింది భారత్. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు జూన్ 21, 2015 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం యోగా ఫర్ వన్ ఎర్త్- వన్ హెల్త్ (ఒక భూమి- ఒక ఆరోగ్యం కోసం యోగా) ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. శారీరక శక్తి, మానసిక స్పష్టత, భావోద్వేగ శాంతి, ఆధ్యాత్మిక సామరస్యత కోసం యోగాను శక్తివంతమైన సాధనంగా ప్రోత్సహించడం దీని ఉద్దేశం.



గుంటూరు వెస్ట్ (క్రీడలు): అతి తక్కువ ఖర్చుతో కుల మతాలకు అతీతంగా చక్కని ఆరోగ్యం, మానసిక ప్రశాంతత పొందడం యోగా ప్రత్యేకత. చక్కటి ఆరోగ్య అలవాట్లు, పాజిటివ్ దృక్పథంతో పాటు సామాజిక బాధ్యత కూడా మిళితమై ఉండడం మరో ప్రత్యేకత. అందుకే పేద వాడి దగ్గర్నుంచి ఉన్నత వర్గాలు, విద్యాంతులు, వైద్యులు కూడా యోగ సాధన చేస్తున్నారు. జిల్లాలో గత నెల రోజుల నుంచి యోగాంధ్ర-2025 పేరుతో ప్రతి రోజూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం జరగనున్న యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలో సుమారు 5 లక్షల మందితో యోగాసనాల కార్యక్రమం నిర్వహించనున్నారు. గుంటూరులో 35 వరకు యోగా కేంద్రాలు వారి స్థాయిలో శిక్షణనిస్తున్నాయి. కొన్ని స్వల్ప ఫీజులతో ఉంటే మరికొన్ని ఏసీ వంటి ఆధునిక సదుపాయాలు ఏర్పాటు పెద్ద మొత్తంలో తీసుకుంటున్నాయి. ఆన్‌లైన్ క్లాసులు కూడా కొందరు చెబుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా యోగసనాల కార్యక్రమం



అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం 5 లక్షల మందితో జిల్లా వ్యాప్తంగా యోగాసనాల కార్యక్రమం చేపడుతున్నాం. దీనికోసం 4,814 ప్రదేశాలను ఎంపిక చేశాం. ఇప్పటికే 5 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. గత నెల రోజల నుంచి జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర-2025 లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలు మంచి ప్రాచుర్యం పొందాయి. పాఠశాలల దగ్గర్నుంచి ప్రభుత్వ కార్యాలయాల వరకు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా చిన్నారులు బాగా ఆసనాలు వేయడం గమనించాను. వారికి ఇప్పటి నుంచే ఆరోగ్యంపై అవగాహన పెంచాలి.

–ఎస్.నాగలక్ష్మి, జిల్లా కలెక్టర్

పూర్వీకులు ఇచ్చిన గొప్ప వరం



యోగా మన పూర్వీకులు మనకిచ్చిన గొప్ప వరమని చెప్పాలి. సామాన్యుడికి కూడా సులభంగా అర్థమయ్యే రీతిలో ఇది ఉంటుంది. ప్రపంచ దేశాల్లో యోగా శిక్షణ ఇచ్చే గురువులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మన అదృష్టమేమిటంటే ప్రతి పేటకు ఒక శిక్షకుడు అందుబాటులో ఉన్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలి. దీనివల్ల మంచి అలవాట్లు, శరీరంపై అవగాహన వస్తుంది. ఒక వైద్యుడిగా నేను నా పేషెంట్లకు యోగ సాధన చేయమనే చెబుతాను. నేను కూడా క్రమం తప్పకుండా చేస్తాను.

–డాక్టర్ ఓరుగంటి వెంకట రమణ, హోమియో వైద్య నిపుణులు

ఆడపిల్లలు, మహిళలకు అవసరం



నేను 12 ఏళ్ల నుంచి యోగా శిక్షణనిస్తున్నాను. ముఖ్యంగా యువతులను పరిశీలిస్తున్నాను. వీరిలో పీసీఓడీ, హార్మోన్ల ఇన్‌బాలెన్స్, ఊబకాయం తదితర సమస్యలకు యోగాలో చక్కని పరిష్కారముంది. మహిళలకు కూడా అధిక గైనిక్ సమస్యలు వస్తున్నాయి. ముందు గురుముఖంగా నేర్చుకుని ఆ తర్వాత ఇంటి వద్దనే చేయాలి. మహిళలు, యువతల కోసం నేను బ్రామరీ ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, వృక్షాసనం, తాడాసనం, బటర్ ఫ్లైలాంటి ఆసనాలను చేయిస్తుంటాను. వారి సమస్యలు చాలా వరకు తగ్గాయి. జంక్ ఫుడ్స్ అవకాశం ఉన్నంత వరకు తగ్గించాలి. ఆన్‌లైన్‌లో విదేశీయులకు కూడా శిక్షణనిస్తున్నాను.

–కె.లక్ష్మి, యోగా టీచర్

చిన్నప్పటి నుంచే చక్కని సంస్కారం



యోగాకు, నృత్యానికి దగ్గర సంబంధముంది. నేను చిన్నపిల్లలకు యోగా నేర్పిస్తుంటాను. డాన్స్‌లోనూ శిక్షణనిస్తాను. చిన్నప్పటి నుంచి పిల్లలకు యోగా అలవాటు చేస్తే వారిలో క్రమ శిక్షణతోపాటు జీవితంలో చక్కని సంస్కారం నేర్చుకుంటారు. యోగా అంటేనే క్రమశిక్షణ. దాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు ముందుకు రావాలి.

–విజయగౌరి, ఫౌండర్ ఆర్ట్ ఆఫ్ నటరాజ్ ఆర్ట్ అండ్ సైన్స్ అకాడమీ, గుంటూరు


హార్మోన్ల ఉత్పత్తి పెంపొందిస్తుంది



మన శరీరాన్ని నడిపించే హార్మోన్ల స్థితిని యోగా అద్భుతంగా మెరుగుపరుస్తుంది. ప్రస్తుతం సమాజంలో మధుమేహం, రక్తపోటు, హార్మోన్ల ఇన్‌బ్యాలెన్స్ తరచుగా చూస్తున్నాను. మన ఆరోగ్యం మారాలంటే జీవన శైలి మార్చుకోవాలి. మిత ఆహారంతో పాటు వాకింగ్, యోగా, మెడిటేషన్ చేయాలని తరచూ నా పేషెంట్లకు చెబుతుంటాను. ఇప్పటికీ కొందరు యోగ సాధనతో ఇన్సులిన్ నుంచి విముక్తి పొందిన వారున్నారు. యోగాను నిరంతరం సెలబ్రెటీలు కూడా ప్రమోట్ చేస్తుండాలి. జీవన శైలిని మార్చుకుని యోగా సాధన చేస్తే నూటికి 90 శాతం రోగాల నుంచి బయటపడవచ్చు. కొన్ని వేల సంవత్సరాల కిందట పతంజలి మహర్షి మన దేశానికి అందించిన గొప్ప వరం యోగా.

–డాక్టర్ కె.సుబ్బారావు, ఎండో క్రైనాలజిస్ట్

వృత్తితో పాటు ఉపాధి



నేను న్యాయవాద వృత్తిలో ఉన్నాను. యోగాలో శిక్షణ పొంది ఇప్పుడు కొందరికి శిక్షకుడిగా మారాను. నిత్యం ఆరోగ్యంతో పాటు చక్కని సంస్కారాన్ని, ప్రతి నిత్యం మనల్ని మనం పరిశీలించుకునే తత్వాన్ని యోగా ద్వారా నేర్చుకున్నాను. అనారోగ్యం దరి చేరదు.

– వెంకటేష్, యోగా శిక్షకుడు

ఎన్జీరంగా వర్సిటీలో యోగా డే



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందున్న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యోగా గురువు వేణుమాధవ్ విశ్వవిద్యాలయం, శాస్త్రవేత్తలు, అధికారులు, విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వీసీ ఆర్. శారదజయలక్ష్మీదేవి, రిజిస్ట్రార్ జి. రామచంద్రరావు, పరిశోధన సంచాలకులు పి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు

- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- కిలో ధర రూ. 120

గుంటూరు వెస్ట్: ప్రస్తుత మార్కెట్‌లో హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు ఆశాజనకంగా లేనందున రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. చుట్టుగుంటలోని టీడబ్ల్యూసీ గోడౌన్ వద్ద శుక్రవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా జీడీటీఎంఎస్ ఏజెన్సీతో పొగాకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. హెచ్ బర్లీ పొగాకు టాప్ గ్రేడ్ (హెచ్‌డీఎం) కేజీ ధర రూ. 120, సాధారణ గ్రేడ్ (హెచ్‌డీఎస్) ధర రూ. 60 చొప్పున కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రత్తిపాడు, ఫిరంగిపురం, కాకుమాను తోపాటు, మొత్తం ఎనిమిది మండలాల్లో 3,653 మంది రైతులు, 13,544 ఎకరాల విస్తీర్ణంతో హెచ్‌డీ బర్లీ పొగాకు సాగు చేసినట్లు సమాచారం ఉందన్నారు. రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవ కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సహాయకుల ద్వారా పీఎంఏపీపీలో ముందుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటి వరకు 1853 మంది పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. వారికి గుర్తింపు నంబరు కేటాయిస్తూ వారి ఫోన్‌కు మెసేజ్ వస్తుందన్నారు. పొగాకు బేళ్ల నికర తూకం 25 కేజీలు తగ్గకుండా గరిష్ఠంగా 150 కేజీలు మించకుండా సిద్ధం చేసుకుని తీసుకురావాలని ఆమె సూచించారు. తేమ శాతం 20 శాతానికి మించి ఉండరాదని చెప్పారు. తేమ శాతాన్ని క్షేత్రస్థాయిలోనే పరిశీలించుకునేందుకు వీలుగా క్లస్టర్ పరిధిలోని రైతులు రైతు సేవా కేంద్రాల్లో కొలిచే మిషన్లు అందుబాటులో ఉంచామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో సిబ్బందిని నియమించి, వారికి శిక్షణ కూడా ఇచ్చినట్లు పేర్కొన్నారు. రైతులు ఎవరూ దిగాలు పడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహం, డీడీ సీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాల్, కొనుగోలు టెక్నికల్ ప్రాజెక్టు మేనేజర్ కల్యాణ్‌రామ్ పాల్గొన్నారు.

23 నుంచి ఫ్లైఓవర్ పనులు

శంకర్ విలాస్ ఫ్లైఓవర్ పనులు ఈ నెల 23 నుంచి ప్రారంభవుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముందుగా ఏసీ కాలేజీ వైపు నుంచి పనులు ప్రారంభించాలని, దీనికి సంబంధించి సోమవారం నుంచి ట్రాఫిక్ మళ్లింపు చేపట్టాలని ఆదేశించారు. వాహనాల మళ్లింపు గురించి ట్రాఫిక్ పోలీసులు పత్రికలు, మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేయాలని ఆమె చెప్పారు. వాహనదారులకు వీలైనంత వరకు ఇబ్బంది లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. డొంక రోడ్డులోని మూడు వంతెనల వద్ద రోడ్డు లెవెలింగ్ చేయాలని ఆదేశించారు.

టెండరింగ్‌లో సిండి'కేటులు'

- కూటమి కాంట్రాక్టర్లకు అండగా ఇంజినీరింగ్ అధికారులు
- గత నెల 8న ఓపెన్‌చేసిన టెండర్లను సాకులు చూపి క్లోజ్
- 18న జరగాల్సిన టెండర్ల ఓపెనింగ్ కూడా వాయిదా



నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు దూదూ బసవన్నలుగా మారారు. అభివృద్ధి పనుల టెండరింగ్‌లో కూటమి కాంట్రాక్టర్లు చెప్పినట్లు చేస్తున్నారు. వారి కనుసన్నల్లో ఇంజినీరింగ్ వ్యవస్థ నడుస్తోంది. గత నెల 8న 269 వర్కులు, ఈ నెల 18న రూ.20కోట్లు విలువైన 16 వర్కులకు వివిధ కారణాలు చూపి ఇంజినీరింగ్ అధికారులు టెండర్ ప్రక్రియ నిలిపివేశారు. దీనిపై కొంతమంది కాంట్రాక్టర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఇలాంటి సంస్కృతి లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాయిదా పడిన వర్కులకు నేడు టెండర్

నగరపాలక సంస్థ పరిధిలో జరిగే ప్రతి వర్కు తమకే చెందాలని, లేనిపక్షంలో టెండర్లు నిలిపివేస్తామని ఇటీవల కాంట్రాక్టర్ల అసోసియేషన్ సమావేశంలో కూటమికి చెందిన కాంట్రాక్టర్లు బహిరంగంగానే బెదిరింపులకు దిగారు. గత నెల 8న కొన్ని పనులకు టెండర్ తెరవాలి.వర్కుల్లో కూటమి నేతలు కాకుండా వేరే వారు ఉన్నారని, ఆపేయాలంటూ కూటమి ప్రజాప్రతినిధులు డ్రాయింగ్ బ్రాంచ్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చారు. టెండర్ కాల్ ఫర్ చేసిన కొద్ది రోజుల్లోనే టెండర్ ఓపెన్ చేయాలనే నిబంధనల మేరకు డ్రాయింగ్ బ్రాంచ్‌లో పనిచేసే ఓ అధికారి 20 రోజుల తరువాత తెరిచారు. దీన్ని వ్యతిరేకించిన కొంతమంది బడా కాంట్రాక్టర్లు, అధికారులను అడ్డంపెట్టుకుని టెండర్లన్నింటిని రద్దు చేయించారు. జీఎస్టీ క్లియరెన్స్ లేకుండా ఏ విధంగా ఓపెన్‌చేశావంటూ సదరు అధికారిని మాతృశాఖకు సరెండర్ చేశారు. గత నెల 8న ఆగిపోయిన 269 వర్కులకు ఈ నెల 18న తెరిచేందుకు అధికారులు ఓపెన్ టెండర్ ప్రక్రియ నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. దీన్ని కూడా ఆపేశారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారులు భిన్న వాదనలు వినిపిస్తున్నారు. సదరు టెండర్లల్లో ఎవరూ పాల్గొనలేదని, అందుకే రెండు రోజులు వాయిదా వేసినట్లు చెబుతున్నారు. 21న తిరిగి నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు.

షేరింగ్ కుదిరినట్లే !

నగరపాలక సంస్థలో జరగాల్సిన 269 వర్కులకు షేరింగ్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఏడు వార్డుల్లో ప్రాధాన్యత కలిగిన 40 నుంచి 50 వర్కులకు కూటమికి చెందిన కాంట్రాక్టర్లే పాల్గొనేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రాధాన్యత లేని వర్కులకు మిగిలిన కాంట్రాక్టర్లు వేసే విధంగా ఒప్పందం కుదురుస్తున్నారు. ఓపెన్ టెండర్‌లో ఎవరూ పాల్గొనకుండా చేస్తున్నారు.

ఉత్సవ విగ్రహంలా అసోసియేషన్

కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఉత్సవ విగ్రహంలా మారింది. కాంట్రాక్టర్లకు అండగా ఉండాల్సిన నేతలు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. డ్రాయింగ్ బ్రాంచ్‌లో నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉన్నా పట్టించుకోవడం లేదు. మైనింగ్‌కు సంబంధించి బిల్స్ ఆగిపోయినా పట్టించుకునే వారు కరువయ్యారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. వర్కులు చేస్తున్నప్పుడు వాటర్ ట్యాంకర్‌కు రూ.500 వసూలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. కాంట్రాక్టర్ల సమస్యలు పట్టించుకోకుండా వర్కుల షేరింగ్ కోసమే మాట్లాడతారా ? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

23 నుంచి గుంటూరు నగరంలో ట్రాఫిక్ మళ్లింపు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ దృష్ట్యా ఈనెల 23 నుంచి ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

శంకర్ విలాస్ రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణ దృష్ట్యా..

- అమరావతి రోడ్డు నుంచి ఎంటీబీ (మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా) సెంటర్ (రమేష్ హాస్పిటల్ కూడలి) వైపు వెళ్లే భారీ వాహనాలు చిల్లీస్ పాయింట్ నుంచి ఇన్నర్ రింగ్ రోడ్ ద్వారా ప్రయాణించాలి.
- ఎంటీబీ సెంటర్ (రమేష్ హాస్పిటల్ కూడలి) సెంటర్ నుంచి లాడ్జికూడలి వైపు వెళ్లే భారీ వాహనాలు రమేష్ హాస్పిటల్ నుంచి కంకరగుంట రైల్వే ఓవర్‌బ్రిడ్జి మార్గం మీదగా వెళ్లాలి. (పాఠశాల, కళాశాలల బస్‌లకు కూడా వర్తిస్తుంది).
- లాడ్జి సెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్ వైపు కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు అరండల్‌పేట, పొట్టి శ్రీరాములునగర్, డొంకరోడ్డు, మూడు వంతెనలు లేదా బ్రాడీపేట నుంచి కంకరగుంట రైల్వేఓవర్ బ్రిడ్జి మీదగా ప్రయాణించవచ్చు.
- కోబాల్ట్‌పేట, కృష్ణానగర్, చంద్రమౌళీనగర్, బృందావన్ గార్డెన్స్, లక్ష్మీపురం పరిసర ప్రాంతాల నుంచి మార్కెట్ వైపునకు వచ్చే కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలన్నీ పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ రోడ్ లేదా బ్రాడీపేట ద్వారా కంకరగుంట రైల్వేగేట్ అండర్‌పాస్ మీదగా కలెక్టర్ కార్యాలయం రోడ్, రమేష్ హాస్పిటల్ వైపుగా వెళ్లాలి.
- మూడు వంతెనలు నుంచి జీజీహెచ్‌కు వెళ్లేవారు నాజ్ సెంటర్ నుంచి పల్లవి థియేటర్ మార్గం మీదగా వెళ్లాలి.
- జీజీహెచ్ నుంచి ఎంటీబీ సెంటర్‌కు పల్లవి థియేటర్, నాజ్ సెంటర్, మహిళా కళాశాల రోడ్డు మార్గాన్ని వినియోగించాలి.
- జీజీహెచ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు పల్లవి థియేటర్, నాజ్ సెంటర్, భగత్‌సింగ్ మార్గంలో వెళ్లాలి.
- బస్టాండ్ నుంచి జీజీహెచ్‌కు భగత్‌సింగ్ విగ్రహం, నాజ్ సెంటర్, పల్లవి థియేటర్ మార్గం మీదగా వెళ్లాలి.
- లాడ్జి సెంటర్ నుంచి ఎంటీబీ సెంటర్‌కు భారీ వాహనాలను చిల్లీస్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఆటోనగర్, బస్టాండ్ లేదా కంకరగుంట రైల్వే ఓవర్ బ్రిడ్జి మార్గాల్లో ప్రయాణించాలి.

ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాల కోసం ప్రభుత్వం నుంచి నోటిఫికేషన్ విడుదలైనట్లు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 15వ తేదీలోపు దరఖాస్తులను ఐటీఐ. ఏపీ. జీవోవి. ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం తెనాలి, గుంటూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో జూలై 15వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. జూలై 21న ఉదయం 9గంటలకు తెనాలి, గుంటూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న 250 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలోని పది ప్రైవేటు కళాశాలల్లో ఖాళీగా ఉన్న 1,070 సీట్లకు జూలై 23, 24,25 తేదీల్లో కౌన్సెలింగ్ జరుగుతుందని తెలియజేశారు. వివరాలకు 63045 72793, 93914 02684లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సంప్రదించాలని ఆయన సూచించారు.

కులధ్రువీకరణ పత్రాలు లేక అవస్థలు

రాష్ట్ర బేడ బుడగ జంగం ఐక్యవేదిక జేఏసీ వ్యవస్థాపకులు శ్రీనివాస్


మాట్లాడుతున్న శ్రీనివాస్

లక్ష్మీపురం: రాష్ట్రంలో బేడ బుడగ జంగం కులస్తులు 20 సంవత్సరాల నుంచి కుల ధ్రువీకరణ పత్రాలు లేక అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర బేడ బుడగ జంగం ఐక్యవేదిక జేఏసీ వ్యవస్థాపకులు కడమంచి శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే ఎస్సీలుగా గుర్తించి కుల ధ్రువీకరణ ఇవ్వాలని ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని ఆయన కోరారు. పార్లమెంట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించి, బిల్లు పాస్ చేయించి తమకు న్యాయం చేయాలని విన్నవించారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఎంతటి పోరాటాలకైనా సిద్ధపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖతో ప్రజలకు నిత్యం అనుబంధం

జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు వెస్ట్: పుట్టుక నుంచి మరణం వరకు ప్రజలకు రెవెన్యూ శాఖతో అనుబంధం ఉంటుందని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో శుక్రవారం రాత్రి రెవెన్యూ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే అంశంలో మరింత వేగంగా, పారదర్శకంగా రెవెన్యూ సిబ్బంది పని చేయాలని ఆయన సూచించారు. ప్రస్తుత సమాజంలో పని వేగం పెరిగిందని, దీనికి తగ్గట్లు ఉద్యోగులు ఎప్పటికప్పుడు మార్పులు చేసుకుని ముందుకు వెళ్లాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న కార్యక్రమంలో అందిన అర్జీలను అత్యంత వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ డే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహించడం సంతోషమని పేర్కొన్నారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రోజురోజుకూ తమ బాధ్యత మరింత పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వాలు కూడా ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.

నడుములు విరుగుతున్నాయ్!


అన్నదాన సత్రం పక్కన రోడ్డు దుస్థితి


లక్ష్మీపురం మూడో లైను మొదట్లో భారీ అగాధం

- అధ్వానంగా అన్నదాన సత్రం పక్క రోడ్డు
- రోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు
- మరమ్మతులను పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రం పక్క రోడ్డు అధ్వానంగా మారింది. అమరావతి రోడ్డు మీదుగా కొరిటెపాడు సెంటర్‌కు వెళ్లేందుకు కీలకంగా ఉన్న ప్రధాన రహదారి పొడవునా గోతులు, గుంతలతో నిండి పోయింది. వాహనాల రాకపోకలకు ఏ మాత్రం అనువుగా లేదు. నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగస్తులతో వందలాది ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు నిత్యం ఈ రోడ్డు మీదుగా ప్రయాణం సాగిస్తాయి. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రహదారులను నిర్మిస్తున్న నగరపాలకసంస్థ అధికారులు అమరావతి రోడ్డు, కొరిటెపాడును కలుపుతూ సాగుతున్న ఈ రోడ్డు నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా గుంతల్లో ప్రయాణంతో నడుములు విరుగుతున్నాయని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి మరమ్మతులతో పాటు నూతన రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- లక్ష్మీపురం 3వ లైను రహదారిపై పడిన భారీ అగాధం ప్రమాదకరంగా మారింది. రోడ్డు ముఖ ద్వారంలో పైపులైనుకు ఏర్పడిన లీకేజీ కారణంగా దెబ్బతింది. అక్కడ భారీ గుంత ఉన్న సంగతి తెలియక వాహనదారులకు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించిన గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

నారాయణ కళాశాల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ



కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నేతలు

లక్ష్మీపురం: అక్రమంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను వేల రూపాయలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్న కొత్తపేటలోని నారాయణ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల వద్ద విద్యార్థి సంఘాల నేతలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాసర్‌జీ మాట్లాడుతూ కళాశాలకు గుర్తింపు కూడా లేదని ఆరోపించారు. అధిక ఫీజుల దోపిడీలకు పాల్పడుతున్నారని, తక్షణమే విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు పర్మిషన్ లేకుండా కళాశాల నిర్వహిస్తున్నా ఏమాత్రం పట్టించుకోవట్లేదని తెలిపారు. జిల్లా కార్యదర్శి యశ్వంత్ రఘువీర్ మాట్లాడతూ ముందస్తు అడ్మిషన్ల పేరుతో కళాశాల యాజమాన్యాలు తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి, కల్లబొల్లి మాటలు చెప్పి అడ్మిషన్లు చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనిని విద్యాశాఖ అధికారులు అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు. అక్రమాలకు పాల్పడున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రణీత్, ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు డేవిడ్, అమర్‌నాథ్, నగర సహాయ కార్యదర్శి వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

నిత్య జీవితంలో యోగా అంతర్భాగం కావాలి


టీజేపీఎస్ కళాశాలలో యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: నిత్య జీవితంలో యోగా అంతర్భాగం కావాలని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులతో యోగా సాధన చేయించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు భారతదేశం ఇచ్చిన గొప్పవరం యోగా అన్నారు. శ్వాసపై నియంత్రణ కలిగి, ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతంగా జీవితాన్ని పొందగలరని తెలిపారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి జేవీ సుధీర్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి మేజర్ పి. కుమార్ రాజా, పీడీలు ఆర్. శివాజీ, వాసుదేవరావు పాల్గొన్నారు.

- అమరావతి రోడ్డులోని శారదా స్కూల్లో విద్యార్థుల యోగా అక్షరమాల ఆకృతిలో కూర్చుని సాధన చేశారు. ఈ సందర్భంగా యోగా మాస్టారు జల్లేపల్లి వెంకటేశ్వరరావు విద్యార్థులకు యోగా ప్రాధాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.ఎం. దాస్, డైరెక్టర్ వి.భారతీవాణి పాల్గొన్నారు.

సమ్మెలోకి ఇంజినీరింగ్ విభాగ కార్మికులు


మేయర్‌కు నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

నెహ్రూనగర్: రాష్ట్రవ్యాప్తంగా 22వ తేదీ అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి వెళుతున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ గుంటూరు నగరపాలక సంస్థ కమిటీ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటి బాబు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం నగర మేయర్ కోవెలమూడి రవీంద్రకి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా కోటి బాబు మాట్లాడుతూ నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లోని ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని పలు మార్లు ప్రభుత్వానికి విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఈ నెల 2న కార్మిక సంఘాలను చర్చలకు పిలిచి ఎటువంటి హామీ ఇవ్వలేదని, ముఖ్యమంత్రి గారితో మాట్లాడి చెప్తానని చర్చలను అర్ధంతరంగా ముగించి వెళ్లిపోయారని విమర్శించారు. ఇంతవరకు ప్రభుత్వం నుంచి పిలుపు రాకపోవడంతో ఈనెల 9న వడ్డేశ్వరంలో కమిషనర్ సంపత్ కుమార్‌ను కలిసి, 22వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తున్నామని నోటీసు ఇచ్చినట్లు తెలిపారు.

జెడ్పీ నిధులతో చేపట్టిన పనులను వేగవంతం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని వివిధ గ్రామాల్లో జెడ్పీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధికారులను ఆదేశించారు. జెడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ చాంబర్‌లో శుక్రవారం సీఈవో వి.జ్యోతిబసు అధ్యక్షతన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ పనుల వివరాలతో నివేదికలను ప్రతినెలా మొదటి వారంలో జెడ్పీకి అందజేయాలని సూచించారు. పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు గూగుల్ షీట్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. రద్దు చేయాల్సిన పనులు, వీలుకాని వాటి వివరాలను జెడ్పీలోని ప్రణాళిక విభాగానికి తెలియపర్చాలని చెప్పారు. నిధుల వినియోగ ధ్రువపత్రాలను, పనులను పూర్తి చేసిన కాంట్రాక్టర్లు, ఏజెన్సీల బిల్లులను నిర్దేశిత ఫార్మాట్‌లో జెడ్పీకి సమర్పించాలని తెలిపారు. ఎం.బుక్, బిల్లులను భద్రంగా ఉంచాలని చెప్పారు.

జెడ్పీ కార్యాలయ పనుల పరిశీలన

జెడ్పీ పరిపాలన భవన మరమ్మతు పనులను చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా పరిశీలించారు. రూ.30 లక్షలతో చేపట్టిన కారిడార్, శ్లాబ్, టాయిలెట్ల మరమ్మతులను తనిఖీ చేశారు. పనుల్లో పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆమె సూచించారు.

నేడు విశాఖలో 'సిడ్స్' సదస్సు ప్రారంభం


డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

గుంటూరు మెడికల్: క్లినికల్ ఇన్ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ (సిడ్స్) ఆంధ్రప్రదేశ్ చాప్టర్ సదస్సును శనివారం విశాఖపట్నంలో ప్రారంభిస్తున్నట్లు ప్రముఖ ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్ట్, సిడ్స్ ప్రెసిడెంట్, గుంటూరు హెల్ప్ హాస్పిటల్ అధినేత డాక్టర్ కొనగంటి కల్యాణ చక్రవర్తి తెలిపారు. అరండల్‌పేటలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన సదస్సు వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఫిజీషియన్లు, క్రిటికల్ కేర్ స్పెషలిస్టులు, మైక్రో బయాలజిస్టులు, పీజీ వైద్య విద్యార్థులు సదస్సుకు హాజరవుతారని పేర్కొన్నారు. విశాఖపట్నం హోటల్ గ్రీన్ పార్క్‌లో జరిగే సదస్సులో యాంటీబయోటిక్స్‌లో వచ్చిన ఆధునిక మందులు, చికిత్స పద్ధతుల గురించి వివరిస్తారన్నారు. 'రైట్ డ్రగ్ – రైట్ టైమ్– రైట్ స్టేజ్' అనే నినాదంతో సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డాక్టర్ వి.రామసుబ్రహ్మణ్యం, డాక్టర్ మోహన్ మహరాజ్, డాక్టర్ శ్రీధర్ శ్రీనివాసన్‌లు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సీనియర్ సిడ్స్ మెంబర్ డాక్టర్ నర్రెడ్డి సునీత, డాక్టర్ గాయత్రి, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రామసుబ్రహ్మణ్యం తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. దేశంలోనే ఇన్‌ఫెక్షన్లపై పోరాటంలో అతి పెద్ద సొసైటీగా తమ సంస్థకు గుర్తింపు వచ్చిందని చెప్పారు. సదస్సులో పలు పరిశోధన, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ కల్యాణ చక్రవర్తి వివరించారు.

నేడు సీబీఆర్ అకాడమీ రజతోత్సవాల పోస్టల్ కవరు విడుదల


రాజేంద్రప్రసాద్

తెనాలి: కృష్ణాజిల్లాలోని సీబీఆర్ స్పోర్ట్స్ అకాడమీ రజతోత్సవాల సందర్భంగా పోస్టల్ శాఖ ప్రత్యేక కవరును విడుదల చేస్తోంది. చలసాని బాబు రాజేంద్రప్రసాద్ స్థాపించిన స్పోర్ట్స్ అకాడమీతో క్రీడారంగంలో ఆయన విశిష్ట సేవలు, సామాజిక సేవలను గుర్తించి తీసుకొచ్చిన ప్రత్యేక పోస్టల్ కవరును శనివారం సాయంత్రం 4 గంటలకు ఇక్కడి ప్రధాన పోస్టాఫీసులో విడుదల చేయనున్నారు. కార్యక్రమ వివరాలను పోస్టల్ సూపరింటెండెంట్ ఎం.శ్రీనివాసు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రత్యేక పోస్టరు కవరు విడుదలకు ముఖ్య అతిథిగా ఐఆర్ఎస్ అధికారి బీకే రావు హాజరుకానున్నారు. గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ డీఎస్వార్ మూర్తి, బ్రిగేడియర్ వెంకటరెడ్డి, సుశీల, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల సైనిక్ సంక్షేమ అధికారి హాజరవుతున్నట్లు వివరించారు. తెనాలి హెడ్ పోస్ట్‌మాస్టర్ ఈ.నాగేశ్వరరావు, సిబ్బంది నిర్వహించే ఈ కార్యక్రమానికి మా–ఏపీ అధ్యక్షుడు దిలీప్‌రాజా అధ్యక్షత వహిస్తారన్నారు. ఫిలాటిలిస్ట్‌లను కూడా ఆహ్వానిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

తాడికొండ: తుళ్లూరు మండలం వెలగపూడి సచివాలయం సమీపంలో ఈ నెల 23న నిర్వహించనున్న 'సుపరిపాలన–తొలి అడుగు' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఎ భార్గవ్ తేజతో కలిసి పరిశీలించారు. సభాస్థలి, బారికేడింగ్, వాహనాల పార్కింగ్, సీటింగ్ పలు ఏర్పాట్లపై అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు. తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సూచించారు. అధికారులంతా తమకు కేటాయించిన విధులను పాటిస్తూ సీఎం పర్యటనను విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు, సీఆర్డీఏ ఈఈ శ్రీనివాసరావు, తుళ్లూరు తహసీల్దార్ సుజాత పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,500

మోడల్ ధర రూ. 1,300



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 189

కొమ్ములు : 82 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,000	10,200	9,700

కాయలు : 107 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,000	9,700	9,700

మొత్తం అమ్మకాలు : 141.750 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	40,704
అమ్మకాలు	45,388
నిల్వ	4,172

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,000
నంబరు–5	10,000–13,200
341	10,000–13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,800–13,100
నంబరు–5	10,000–13,500
341	10,000–13,500
సూపర్–10	10,000–13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 13,800
బాడిగ–355	10,000 – 13,000
దేవనూరు డీలక్స్	10,000 – 13,000
ఆర్మూర్	9,800 – 11,300
తాలుకాయలు	5,000–6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,000
బాడిగ–355	10,000 – 13,300
తాలు	5,000 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

ఏపీ బిషప్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడిగా జయప్రకాష్

నరసరావుపేట: ఏపీ బిషప్ కౌన్సిల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ జి.జయప్రకాష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడ ఏపీ టూరిజం. పున్నమి ఘాట్లో శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు అధ్యక్షతన ఏపీ బిషప్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జయప్రకాష్ మాట్లాడుతూ.. అనేక కార్యక్రమాలు బిషప్ కౌన్సిల్ ద్వారా నిర్వహిస్తామన్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు కూడా ఇన్‌చార్జిగా తనకు బాధ్యతలు అప్పగించారన్నారు. ముఖ్య అతిథిగా విజయవాడ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కృష్ణమూర్తినాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జయప్రకాష్‌ను అభినందించి సన్మానించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి బిషప్‌లు పాల్గొన్నారు.

నాదమే జీవనం

నేడు వరల్డ్ మ్యూజిక్ డే

కోయిల ఊరికే ఉండదు... పాడుతుంది.
గాలి కూడా కామ్‌గా కూర్చోదు... సవ్వడి చేస్తుంది.
వినాలే గానీ... కిటికీ పరదా చప్పుడు కూడా సంగీతమే!
ఆనందమో, చిరు సంతోషమో కలిగినప్పుడు...
ప్రతి గొంతూ కూని రాగం తీస్తుంది. సంగీతం లేకపోతే... ఈ జగతి ఉత్త శూన్యం.
సప్త స్వరాలే... ఉచ్ఛ్వాస నిశ్వాసలు. 'వరల్డ్ మ్యూజిక్ డే' సందర్భంగా
ఒక పాటకో, ఒక గళానికో, ఒక స్వరానికో కృతజ్ఞత చెప్పకోకపోతే ఎలా..?
నాదమే జీవనంగా బతుకుతున్న నలుగుర్ని కలవకపోతే ఎలా..!



ఊపిరి ఉన్నంతవరకూ పాటే నా ప్రపంచం

- సంగీతదర్శకురాలు శ్రీలేఖ



● మ్యూజిక్ డైరెక్టర్‌గా ప్రతి క్షణం, ప్రతి నిమిషం, ప్రతి రోజూ సంగీతాన్ని ఆస్వాదిస్తాను... ఆనందిస్తాను. ఊపిరి ఉన్నంతవరకు పాటలతో సెలబ్రేట్ చేసుకుంటాను. పాటే నా ప్రపంచం. సంగీతం తప్ప నాకు వేరే ప్రపంచం తెలియదు. సంగీతాన్ని రోజూ ఇష్టపడుతున్నప్పటికీ 'వరల్డ్ మ్యూజిక్ డే' సందర్భంగా నాకు నచ్చిన పాటలను మరింత ఎక్కువగా వింటాను. నేను కంపోజ్ చేసిన పాటలను నెమరు వేసుకుంటాను... ఇలా చేసి ఉంటే బాగుండేది, అలా చేసి ఉంటే బాగుండేది... ఇలా రకరకాలుగా నా పాటలను విశ్లేషించుకుంటాను.

● అప్పట్లో లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఎక్కువగా ఉండేవి. ప్రొడ్యూసర్, డైరెక్టర్, మ్యూజిక్ డైరెక్టర్‌లు ఎక్కువగా కోరుకునేవారు కూడా. పాటలు కూడా అలాగే ఉండేవి. రికార్డింగ్, సాంగ్ రికార్డింగ్‌లో నేను కూడా లైవ్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఉపయోగించాను. వివిధ లైవ్ ఇన్‌స్ట్రుమెంట్లతో హాల్ మొత్తం సందడిగా, పండగ వాతావరణంతో ఉండేది. ప్రతిరోజూ ఒక పండగలా ఉండేది. ఎవరికి వారు బిజీ కావడం, లైవ్ ఇన్‌స్ట్రుమెంట్ రిక్వైర్డ్ సాంగ్స్ రాకపోవడం, డీజే టైప్ పాటలు, రెట్రో, హిప్ హాప్‌లాంటివి వచ్చి లైవ్ అవసరం లేకుండా పోయింది. ఒకవేళ అవసరం ఉన్నా ఎక్కడున్న వారు అక్కడ, ఎవరికి టైమ్ ఉన్నప్పుడు వారు పాడి, వాయించి పంపుతున్నారు. వాటిని తరువాత మిక్స్ చేస్తున్నారు. అంతా డిజిటలైజ్డ్ అయిపోయింది. ఇది ఎంతవరకు వెళుతుందో మాత్రం తెలియదు.

● ఫుల్ ఆర్కెస్ట్రా ఉన్నప్పుడు సాంగ్ స్ట్రక్చర్ ఇలా రాబోతుందని తెలిసేది. ఎందుకంటే సింగర్స్‌తో సహా లైవ్ ఉండేది. స్ట్రక్చర్ గురించి ఇప్పుడు మ్యూజిక్ డైరెక్టర్‌కే తెలియడం లేదు. అక్కడొక ముక్క, ఇక్కడొక ముక్క, పల్లవి ఒకరు చేస్తారు... బీజియమ్ ఒకరు చేస్తారు. ఫైనల్ వచ్చే వరకు కూడా సాంగ్ ఎలా వస్తుంది? అనేది మ్యూజిక్ డైరెక్టర్‌కి తెలియడం లేదు. మార్పులు, చేర్పులు చేయాలంటే అదొక తతంగం. సో... సాంకేతిక అభివృద్ధి పరంగా మైనస్ ఉంది. కాకపోతే పని గంటలు తగ్గుతాయి. అలాంటి ప్లస్‌లూ ఉన్నాయి.

● సీనియర్ మ్యూజిక్ డైరెక్టర్స్ అందరితోనూ బాగుంటాను. కోటిగారు, వందేమాతరం శ్రీనివాస్ గారు, కీరవాణి అన్నయ్య, మణిశర్మగారు... ఇలా ఎంతోమంది చిన్నప్పటి నుంచి నన్ను చూసి ఉన్నారు కాబట్టి, అందరికీ నేను పెట్. అందరూ నన్ను అభిమానిస్తారు.

● నేను సినిమా ఒప్పుకోవడానికి మూడు విషయాల గురించి ఆలోచిస్తాను. మొదటిది కథ. జనరల్‌గా కథే కదా హీరో. కథ ఎలా ఉంది. ఏ జానర్‌లో ఉంది. డైరెక్టర్ ఫ్యాషనేట్‌గా తీయగలరా? ప్రాపర్‌గా రిలీజ్ చేయగలరా? వీటి గురించి ఆలోచిస్తాను. ● మహిళలు, పురుషులు అని కాదు... సినిమా ఫీల్డ్‌లోకి రావాలంటే ఎవరికైనా అది అంత తేలికైన విషయం కాదు. కమర్షియల్ ఫీల్డ్ కాబట్టి ఇంట్లో అందరినీ ఒప్పించాలి. చాలా టాస్క్‌లు ఉంటాయి. దేవుడి దయ వల్ల ఆ టాస్క్‌లన్నీ దాటుకొని ఇప్పటికీ సక్సెస్‌ఫుల్‌గా ఉన్నాను.

● నా సినిమాల్లో నాకు సంతృప్తినిచ్చినవి చాలా ఉన్నాయి. ఉదాహరణకు 'ధర్మచక్రం, తాజ్ మహల్, ప్రేమించు, ప్రేయసి రావే, శివయ్య' వంటివి. మొన్న వచ్చిన 'హిట్-2'లో 'ఉరికే ఉరికే' సాంగ్ బ్లాక్ బస్టర్. నా కెరీర్‌లో ఎక్కువగా మంచి సినిమాలకు పని చేసే చాన్స్ రావడం నా అదృష్టం.

● ఏఐ (కృత్రిమ మేధ) గురించి విన్నాను. ఎంత ఏఐ వాడినా, ఎలా చేసినా తెలిసిపోతుంది. హ్యూమన్ ఎమోషన్ ఏఐ ఇవ్వలేదు. మనిషి కంపోజ్ చేసి ఇచ్చినంత ఏఐ ఇవ్వలేదు.

● సినిమా రంగంలో రావడానికి నేను వచ్చిన టైమే కష్టం అనుకుంటే ఇప్పుడు మరింత కష్టం అయింది. ఎంతోమంది డైరెక్టర్స్, సింగర్స్, కంపోజర్స్ వస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని బాగా కష్టపడాలి. ఇక మనం ఏ స్థాయికి వెళతామనేది అది మన అదృష్టంపై ఆధారపడి ఉంటుంది.

– డి.జి. భవాని

మనసుని తాకాలంటే మెలోడీ బెస్ట్

- సంగీతదర్శకుడు అనూప్ రూబెన్స్

● ప్రపంచ సంగీత దినోత్సవాన్ని జూన్ 21న వరల్డ్ వైడ్‌గా జరుపుకుంటారు. మనకు కూడా ఇక్కడ మ్యూజిక్ డే సెలబ్రేషన్స్‌ని చేస్తుంటారు. కానీ, నాకైతే ప్రతి రోజూ సంగీత దినోత్సవమే. ఎందుకంటే ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి వరకూ సంగీతంతోనే ఉంటాను కాబట్టి.

● సంగీతంలో అప్పటికీ, ఇప్పటికీ టెక్నాలజీ వైజ్, వర్కింగ్ వైజ్ చాలా మార్పులొచ్చాయి. మ్యూజిక్ ఎప్పుడూ మెలోడీ వైజ్ మెలోడీనే ఉంటుంది... దాన్ని ఏదీ రీ ప్లేస్ చేయలేదు. గతంలో లైవ్‌లో అందరం ఒకే సారి రికార్డ్ చేసేవాళ్లం. ఇప్పుడు బిట్ బిట్‌గా, సిస్టమ్ ద్వారా చేస్తున్నాం. ఒక పదం పదం పరంగా కూడా రికార్డింగ్ చేస్తున్నాం. అలాగే ఏఐ ద్వారా వాయిస్ మాడ్యులేషన్స్‌లో కూడా మార్పులొస్తున్నాయి.

● సాంకేతికంగా ఎప్పటికప్పుడు మార్పులు వస్తుంటాయి. దానికి తగ్గట్టుగానే పని చేయాల్సి ఉంటుంది. అయితే ముందు రోజుల్లో లైవ్ రికార్డింగ్స్ ఉన్నప్పుడు ఒకటేసారి మొత్తం ఆర్కెస్ట్రా, సింగర్స్ అంతా కలిసి ఒక టేక్‌లో అయిపోయేది. అది ఒక రకంగా సులభంగా ఉండేది. ఎందుకంటే... గతంలో ఫ్లూట్ బిట్, వీణ బిట్, తబలా బిట్ ఇది... అని ఒక ప్రాపర్‌గా సెట్ చేసుకుని కంపోజ్ చేసేవారు. ఇప్పుడు టెక్నాలజీ వచ్చిన తర్వాత చాలా ఆప్షన్స్ వచ్చాయి. ఒక్కొక్క ట్యూన్ సెలక్షన్స్‌కే చాలా రోజులు పట్టేస్తోంది. అంటే ఎక్కువ ట్యూన్స్ ఎంచుకునే అవకాశం ఉండటంతో ఇంకా ఏదో మంచిది దొరుకుతుంది, ఇంకా కొత్త ట్యూన్ దొరుకుతుంది అని. ఈ ప్రాసెస్ కొంచెం కాంప్లికేటెడ్ అయితే ఈ టెక్నాలజీ పరంగా సౌలభ్యం ఏంటంటే టైమింగ్స్. సింగర్ లేదా మ్యుజిషియన్ టైమ్‌కి అందుబాటులో లేకున్నా, ఇతర దేశంలో ఉన్నా వారు పాడటం లేదా వాయించి పంపితే మేము ఇక్కడ యాడ్ చేస్తాం. ఒక రకంగా ఇది అడ్వాంటేజ్.

● ఒక్కో మ్యూజిక్ డైరెక్టర్‌కి ఒక్కో శైలి ఉంటుంది. నా పరంగా వచ్చేసరికి నేనెప్పుడూ మెలోడీని ప్రేమిస్తాను. ఏ పాట కంపోజ్ చేసినా కూడా మెలోడీకి తొలి ప్రాధాన్యం ఇస్తాను. ఎందుకంటే మనకు సంగీతం అనగానే మొదట టచ్ అయ్యేది మనసు. మెలోడీయే మనకు ఎక్కువ రోజులు గుర్తుంటుందని బలంగా నమ్ముతాను. నా తొలి ప్రాధాన్యం ఎప్పుడూ మెలోడీయే. కానీ, కథ, సందర్భం, అవసరాన్ని బట్టి అక్కడ మాస్ సాంగ్ లేదా బీట్ సాంగ్ ఇస్తుంటాను.

● ఇప్పుడొస్తున్న యువ సంగీత దర్శకులు చాలా బాగా పని చేస్తున్నారు. అయితే ఆరోగ్యకరమైన పోటీ అనేది చాలా అవసరం. ఎందుకంటే.. ఒక్కొక్కరికి ఒక్కో శైలి ఉంటుంది. ఒక్కొక్కరిలో ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. వైవిధ్యమైన స్టైల్స్, ఫీల్స్ వినడానికి అవకాశం ఉంటుంది. అలాగే ఇంకా మనం ఏదో చేయాలి? అనే ఉత్సాహం ఉండాలి. అయితే పోటీ ఆరోగ్యకరంగా ఉండాలి.

● నేను చిన్నప్పటి నుంచి ఇళయరాజా సార్, ఏఆర్ రెహమాన్ సార్ పాటలు వింటూ పెరిగాను. వాళ్ల వర్కింగ్ స్టైల్, లైఫ్ స్టైల్.. చెప్పాలంటే వాళ్లే నాకు స్ఫూర్తి. నాకే కాదు ఇప్పుడు కొత్తగా వచ్చే చాలా మంది సంగీత దర్శకులకు, అలాగే ఇప్పుడు ఉన్న వారికి కూడా. నేను మాత్రం ఆర్‌డీ బర్మన్‌గారు, ఇళయరాజా సార్, ఏఆర్ రెహమాన్‌గారు.. వాళ్ల వద్ద నుంచి చాలా నేర్చుకున్నాను. ● సినిమా ఒప్పుకోవాలంటే నా తొలి ప్రాధాన్యత కథే. అయితే కొన్నిసార్లు బ్యానర్, హీరో, డైరెక్టర్ వేల్యూ కూడా ఉంటాయి. అయితే ఎవరైనా కొత్తవాళ్లు, కొత్త ప్రొడక్షన్ హౌస్ వాళ్లు నన్ను కలిస్తే మాత్రం ముందు కథ విని, నచ్చితే ఒప్పుకుంటాను.

● నా కెరీర్‌లో దాదాపు 90 సినిమాలు చేశాను. అయితే ఓ సంతృప్తి అనేది సినిమా విజయం వల్ల ఉంటుంది... కథ వల్ల ఉంటుంది. ఆ స్టోరీ జనాల్లోకి బాగా వెళ్లడం, మన పాటలు బాగా హిట్ అయితే అదో సంతృప్తి ఉంటుంది. నా సినిమాల్లో అలా సంతృప్తి ఇచ్చిన వాటిలో 'ప్రేమకావాలి, మనం, ఇష్క్, గోపాల గోపాల, టెంపర్' వంటివి చాలా ఉన్నాయి.

● ప్రస్తుతం కొత్తగా ఇండస్ట్రీకి వస్తున్న సంగీత దర్శకులు, సింగర్స్‌లో చాలా మంచి ప్రతిభ ఉంది. ఇప్పుడు మీడియా, సోషల్ మీడియా పరిధి బాగా పెరిగింది. దాని వల్ల స్టార్ వేల్యూ, పాపులారిటీ అన్నది గతంతో పోలిస్తే ఇప్పుడు చాలా సులభం అయింది. అయితే కొత్తవాళ్లకు అంకితభావం... ప్రధానంగా ఓపిక అనేది ఉండాలి. అప్పుడే మన లక్ష్యం అనేది చేరుకుంటాం. ప్రతి ఒక్కరికి ఒక్కో టైమ్ ఉంటుంది... మన సమయం వచ్చినప్పుడు ఆ లక్ష్యాన్ని చేరుకుంటాం.

● ప్రస్తుతం 'వారాహి' అనే సినిమా చేస్తున్నాను. అలాగే తేజగారి చిత్రంతో పాటు అర్జున్‌గారి సినిమా చేస్తున్నాను. మరో ఐదారు సినిమాలు కూడా ఒప్పుకున్నాను.

– దేరంగుల జగన్ మోహన్

లైవ్ రికార్డింగ్‌లో డెప్త్ ఉంటుంది

- సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల



● సంగీత దర్శకుడిగా ప్రతిరోజునీ నా ఫస్ట్ డే మ్యూజిక్ డైరెక్షన్‌లానే భావిస్తాను. ప్రతిరోజూ ఓ స్ట్రగులే. అందుకే అప్‌గ్రేడ్ అవుతుంటాను. ప్రజలు ఎలాంటి సంగీతాన్ని ఇష్టపడుతున్నారో తెలుసుకుని, కొత్త తరహా సంగీతాన్నందించాలన్నదే నా తపన.

● మనం ఆనందంలో ఉన్నప్పుడు పాట వింటాము. దుఃఖంగా ఉన్నప్పుడూ పాట వింటాము. మన భావాలను పంచుకోవాలనుకున్నప్పుడు మ్యూజిక్‌తో తెలియజేస్తాం. ఇలా పలు రకాలుగా సంగీతం అనేది మన జీవితంలో ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది.

● దశాబ్ద కాలానికి పైగా సంగీతరంగంలో రాణిస్తున్నాను. ఈ రంగంలో టెక్నాలజీ అప్‌డేట్ అవుతూ వస్తోంది. టెక్నాలజీని మనం ఎంత వరకు కరెక్ట్‌గా వాడాం అన్నది జాగ్రత్తగా గమనించుకుంటుంటే అడ్వాంటేజ్‌గానే ఉంటుంది. కొన్నిసార్లు డిస్‌అడ్వాంటేజ్ కూడా ఉంటుంది. ఎందుకంటే ఒరిజినాలిటీ అనేది ఎప్పుడూ మిస్ కాకూడదు. మ్యూజిక్ అనేది హ్యూమన్ టచ్‌తో సంబంధం ఉన్న అంశం. అలాగే సంగీత దర్శకులకు ఏఐ ఉపయోగపడుతుంది. కానీ మనం దాన్ని ఎంతవరకు వినియోగిస్తున్నాం అన్నది చూసుకోవాలి.

● ఇండస్ట్రీలో ఉన్న పోటీతత్వాన్ని గమనిస్తుంటాను. ఫస్ట్ నాకు నేను పోటీగా ఉండాలనుకుంటాను. ఎంత మంది ఉన్నా కూడా మనకు మనం పోటీగా ఉన్నప్పుడే మనం ముందుకు వెళ్లగలం. ఇండస్ట్రీలో సంగీతదర్శకుల మధ్య ఉండే పోటీని చూసి ఉలిక్కిపడను. నేను ఎదగడానికి ఏం చేయాలి అని చూస్తాను తప్ప పక్కన ఇంకెవరో వచ్చారని కంగారు పడను.

● డిజిటల్ సాయంతో మ్యూజిక్ చేయడం కొంతవరకు సౌకర్యంగానే ఉంటుంది. కానీ లైవ్ రికార్డింగ్స్ అనేవి మాత్రం డెప్త్ క్రియేట్ చేస్తాయి. ఎంత చెప్పినా లైవ్ లైవే... దాంట్లో తిరుగులేదు. నేను గిటారిస్ట్‌ని. లైవ్ అంటే ఏంటో నాకు తెలుసు. ఎంత టెక్నాలజీ వాడినా కూడా లైవ్ అన్నది లైవే. డిజిటలైజ్ వల్ల పని సులభం అవ్వొచ్చు. కానీ లైవ్ రికార్డింగ్ అనేది మ్యూజిక్‌ను నిలబెడుతుంది.

● శ్రోతలకు లిరిక్స్ వినిపించేలా మనం సంగీతం ఇవ్వాలి. ఆ పాటకు లిరిక్స్ చాలా ముఖ్యమని, లిరిక్‌దే ప్రథమ స్థానమని భావిస్తాను. నా సినిమాల్లోని పాటల్లో లిరిక్స్ ఆడియన్స్‌కు వినిపించాలనే ప్రయత్నిస్తుంటాను. లిరిక్స్ ఆడియన్స్‌కు అర్థమైతే, అప్పుడు ఆ లిరిక్‌కు మ్యూజిక్ డైరెక్టర్ ఈ తరహా మ్యూజిక్ ఇచ్చాడని వారికి అర్థమౌతుంది. అదే లిరిక్ అర్థం కాకుండా మనం మ్యూజిక్ ఇస్తే ఎందుకు లిరిక్ అర్థం కావడం లేదని పిస్తుంది. లిరిక్ అర్థమైనప్పుడే సినిమాలోని సందర్భం మ్యూజిక్‌తో ఆడియన్స్‌కు మరింత చేరువ అవుతుంది.

● సినిమాలో సౌండ్ అనేది డిజైన్ చేసినప్పుడు ఫస్ట్ నుంచి లాస్ట్ వరకు ఒకే మ్యూజిక్ డైరెక్టర్ ఉంటే మంచిది. ఒక సినిమాకు ఇద్దరు... ముగ్గురు మ్యూజిక్ డైరెక్టర్స్ వర్క్ చేసే విధానానికి నేను వ్యతిరేకిని. ఇది నా సొంత అభిప్రాయం. అయితే కొన్నిసార్లు ఒక సినిమాకు ఇద్దరు... ముగ్గురు మ్యూజిక్ డైరెక్టర్స్ వర్క్ చేసినప్పుడు అది వర్కౌట్ అయ్యింది. అలాంటప్పుడు ఒక సినిమాకు ఒకే సంగీత దర్శకుడు పని చేయాలని చెప్పడానికి నేనెవర్ని. కానీ... చేస్తే మొత్తం సినిమా చేయాలని నేను కోరుకుంటాను. ఈ విషయంపై నా స్టాండ్ ఏంటంటే... నాకు వ్యక్తిగతంగా ఇష్టం లేదు. కానీ సంగీత దర్శకుల్లో నేను ఒక భాగమే. ఎవరైనా వచ్చి, ఫలానా సినిమాలో ఒకే ఒక్క సాంగ్ చేయమన్నా చేస్తాను.

● నేను సినిమా ఒప్పుకోవాలంటే కథను మాత్రమే చూస్తాను. అలాగే నేను ఉపయోగించే ఇన్‌స్ట్రుమెంట్స్ సినిమా టు సినిమా మారిపోతుంటాయి. కథ, ఆ సినిమా హీరో, ఆ హీరో బాడీ లాంగ్వేజ్‌ని బట్టి ఎలాంటి స్టైల్ క్రియేట్ చేయవచ్చు, డైరెక్టర్ ఏ విధమైన మ్యూజిక్ ఆశిస్తున్నారు. ఇటువంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని ట్యూన్స్ చేస్తాను. ● 'మేజర్, నాంది, గూఢచారి, కృష్ణ అండ్ హిజ్ లీలా, డీజే టిల్లు' వంటి చిత్రాలు ఓ సంగీతదర్శకుడిగా నా కెరీర్‌లో ఎక్కువ సంతృప్తినిచ్చాయి.

● మ్యూజిక్ రంగంలో స్థిర పడాలనుకునే కొత్త తరం వారికి నేను చెప్పేది ఒక్కటే. ఒక్కసారి డిసైడ్ అయితే వెనక్కి తిరిగి చూడొద్దు. నిత్యం కష్టపడాలి. ఫోకస్‌గా ఉండాలి. ప్రతిక్షణం మ్యూజిక్ పైనే ఫోకస్ పెట్టి పని చేయాలని చెబుతాను.

● వరల్డ్ మ్యూజిక్ డేని సెలబ్రేట్ చేసుకుంటాను. ఈ సందర్భంగా నా సహచర మ్యూజిషియన్స్ అందరికీ విషెస్ చెబుతున్నాను. అందరికీ అవకాశాలు రావాలని, అందరూ సక్సెస్ కావాలని, అందరూ ఎదగాలని కోరుకుంటాను. ప్రస్తుతం అడివి శేష్‌గారి 'గూఢచారి 2, ఆది సాయికుమార్‌గారి 'శంబాల' సినిమాలు చేస్తున్నాను. మరో ఆరు సినిమాలు లైనప్‌లో ఉన్నాయి.

- ముసిమి శివాంజనేయులు

నేడు యోగా డే

హెల్దీగా.. హ్యాపీగా...



మహిళల ఆరోగ్యానికి, అంతర్గత ఆనందానికి మేలైన సాధనంగా యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. నేడు యోగా డే సందర్భంగా కొన్ని ఆసనాలు...

1. కోణాసనం: సైడ్ యాంగిల్ పోజ్ గా పిలిచే ఈ ఆసనం వేస్తే.. శరీరం బాగా స్ట్రెచ్ అవుతుంది. కాళ్లు, చేతులకు బలం చేకూరుతుంది. వెన్ను నొప్పి, సయాటికా సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

2. వృక్షాసనం: నిటారుగా నిల్చొని, ఒక పాదాన్ని రెండవ కాలు మధ్యకి తీసుకొచ్చి, రెండు చేతులు తలమీదుగా పూర్తిగా పైకి నమస్కారం భంగిమలో తీసుకోవాలి. ఈ ఆసనం వల్ల మానసిక సమతుల్యత ఏర్పడి ఏకాగ్రత పెరుగుతుంది.

3. పాద హస్తాసనం: నిటారుగా నిల్చొని, శరీరాన్ని ముందుకు వంచి, చేతులను పాదాలకు, తలను మోకాళ్లకు ఆనించాలి. దీనివల్ల నరాల వ్యవస్థ చురుకుగా మారి.. రక్త ప్రసరణ మెరుగవుతుంది.

4. అర్ధ మత్స్యేంద్రాసన: మ్యాట్ పైన కూర్చొని, ఎడమ కాలుని కుడి తొడ పక్క గా తీసుకొచ్చి, నేల మీద ఉంచాలి. ఎడమ చేతిని ఎడమ మోకాలు నుంచి తీసుకొచ్చి, పాదం పట్టుకోవాలి. కుడి చేతిని నిటారుగా నేల మీద ఉంచాలి. ఈ ఆసనం వల్ల ఆక్సిజన్ లెవెల్స్ పెరిగి ఊపిరితిత్తుల సామర్థ్యం పెరుగుతుంది.



సేతు బంధాసన: దీనిని బ్రిడ్జ్ పోజ్ అంటారు. ఇది కటి భాగం, గర్భాశయం, వెన్నుకి చాలా మంచిది. ఇది కటి కండరాలను బలోపేతం చేస్తుంది. పునరుత్పత్తి అవయవాలకు రక్త ప్రసరణను పెంచుతుంది.

6. మార్జాలాసనం: క్యాట్-కౌ పోజ్ గా పిలిచే ఈ ఆసనం వెన్నెముక బలానికి, ఒత్తిడిని తగ్గించడంలోనూ సహాయపడుతుంది కటి కండరాలను ఫ్లెక్సిబుల్‌గా చేస్తుంది.

7.బాలాసన: చైల్డ్ పోజ్ పెద్దలకు కూడా మేలు చేస్తుంది. ఇది ఒత్తిడిని తగ్గించడానికి, విశ్రాంతికి సహాయపడుతుంది. ఈ ఆసనం వెన్నునొప్పిని తగ్గించి, మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.



8. భుజంగాసన: కోబ్రా పోజ్ గా పిలిచే ఈ ఆసనం ఛాతీ, వెన్ను భాగాలను బలోపేతం చేస్తుంది. ఇది శ్వాసను మెరుగుపరుస్తుంది. శక్తిని పెంచుతుంది.

9. త్రికోణాసన: ట్రయాంగిల్ పోజ్ వల్ల పాదాలు, కాళ్ళు, చేతులు, వెన్నును బలోపేతం అవుతాయి. శరీరానికి సమతుల్యతను అందిస్తుంది.

10. మాలాసన: దీనిని గార్లాండ్ పోజ్ అంటారు. రెండు కాళ్ళను వెడల్పుగా ఉంచి, మోకాళ్ళ వరకు వంగి, చేతులను నమస్కారం స్థితికి తీసుకురావాలి. ఈ ఆసనం సాధన చేయడం వల్ల రుతుక్రమము, మలబద్ధకం సమస్యలు తగ్గుతాయి. తొడ కండరాల శక్తి పెరుగుతుంది.



ఈ ఆసనాలను రోజూ సాధన చేయడం వల్ల మానసిక ప్రశాంతత చేకూరి శారీరక ఆరోగ్యం అభివృద్ధి అవుతుంది ఫలితంగా జీవన శైలిలో మంచి మార్పులు కలుగుతాయి.



- అనూష రాకేష్,
యోగా ట్రైనర్, హైదరాబాద్

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 20న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,610
బంగారం (22 క్యారెట్లు)	91,450
వెండి	1,08,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,01,850
బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,09,300
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,00,480
బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,20,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,01,850
బంగారం (22 క్యారెట్లు)	94,860
వెండి	1,09,300
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,800
బంగారం (22 క్యారెట్లు)	89,980
వెండి	1,06,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,00,470
బంగారం (22 క్యారెట్లు)	92,100
వెండి	1,20,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సినిమా

హైదరాబాద్‌లో వారణాసి!



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ అంతర్జాతీయ స్థాయి సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ ఈ వారంలో హైదరాబాద్‌లో మొదలైందని సమాచారం. ఈ షెడ్యూల్ కోసం మేకర్స్ హైదరాబాద్ శివార్లలో భారీ సెట్స్‌ను క్రియేట్ చేశారని తెలిసిందే. ఇందులో భాగంగా వారణాసి నగరాన్ని తలపించేలా భారీ సెట్స్ వేశారని భోగట్టా. ఈ సెట్స్‌కు రూ. 40 కోట్లకు పైనే అయ్యిందని టాక్. అంతేకాదు... ఈ సినిమాలోని మేజర్ సన్నివేశాల చిత్రీకరణ ఈ సెట్స్‌లోనే జరుగుతుందని, అందుకే ఈ స్థాయిలో ఖర్చుపెట్టారనే టాక్ వినిపిస్తోంది. ఇక ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత టీమ్ ఫారిన్‌కి వెళుతుందని, అక్కడి ఫారెస్ట్ లొకేషన్స్‌లో యాక్షన్ సీక్వెన్స్‌లను ప్లాన్ చేశారనే టాక్ వినిపిస్తోంది.

మజిలీ దర్శకుడితో మళ్లీ?



● నాగచైతన్య

నాగచైతన్య కెరీర్‌లోని 25వ చిత్రానికి సంబంధించిన పనులు ఊపందుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో 'వృషకర్మ' (పరిశీలనలో ఉన్న టైటిల్) అనే మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. నాగచైతన్య కెరీర్‌లో ఇది 24వ చిత్రం. కాగా తన కెరీర్‌లోని 25వ సినిమాకి సంబంధించి మంచి కథ కోసం చూస్తున్నారట నాగచైతన్య. ఓ దశలో కిశోర్ అనే ఓ కొత్త దర్శకుడి కథకు ఈ హీరో ఓకే చెప్పారని, ఈ కథతో తెరకెక్కేదే నాగచైతన్య కెరీర్‌లో 25వ మైలురాయి చిత్రం అవుతుందనే ప్రచారం సాగింది. కానీ తనకు 'మజిలీ' వంటి హిట్ ఫిల్మ్ ఇచ్చిన శివ నిర్వాణతో 25వ సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నారట నాగచైతన్య. ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని, పూర్తి కథ సిద్ధమైన తర్వాత శివ నిర్వాణతో సినిమా చేసే విషయమై నాగచైతన్య ఓ నిర్ణయం తీసుకుంటారని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో ప్రచారం జరుగుతోంది. మరి... శివ నిర్వాణతో నాగచైతన్య కాంబినేషన్ రిపీట్ అవుతుందా? నాగచైతన్య 25వ సినిమా ఏ దర్శకుడితో ఉంటుంది? అనే వివరాలు తెలియాలంటే కొన్ని రోజులు ఎదురు చూడాల్సిందే.

సూర్య నలుపు!



● సూర్య

సూర్య హీరోగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు 'కరుప్పు' (నలుపు) అనే టైటిల్ ఖరారైంది. త్రిష హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి, సుప్రీత్ రెడ్డి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సూర్య కెరీర్‌లోని ఈ 45వ సినిమాను భారీ బడ్జెట్‌తో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ప్రకాశ్‌బాబు, ఎస్.ఆర్. ప్రభు నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించి, టైటిల్ లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో ఓ దేవత విగ్రహం ముందు సూర్య కత్తి పట్టుకుని కనిపిస్తున్నారు. ''కొంత గ్యాప్ తర్వాత సూర్య, త్రిష కలిసి మళ్లీ ఈ సినిమా కోసం కలిసి వర్క్ చేస్తున్నారు. చిన్న ప్యాచ్ వర్క్ మినహా షూటింగ్ మొత్తం పూర్తయింది. మరోవైపు ప్రొడక్షన్ వర్క్స్ కూడా జరుగుతున్నాయి. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, జీకే విష్ణు ఛాయాగ్రాహకుడిగా చేస్తున్నారు.